క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుమలేశునికి ప్రత్యేకంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా, స్వామి వారి ఎదుట 40 కేజీల పులిహోరను పెద్ద రాశిగా పోసి, శ్రీనివాస గద్యం పఠిస్తూ నైవేద్యంగా సమర్పించారు.అంతకుముందు, తిరుమల బాలాజీకి తులసీ దళాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.

అన్నప్రసాదానికి విరాళం

ప్రతి శనివారం శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించే అన్నప్రసాద వితరణ కోసం షీలానగర్‌కు చెందిన టి. రాజశేఖర్ రెడ్డి , దుర్గా దేవి దంపతులు రూ. 10వేలు విరాళం అందజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తున్న నాయకులు

గాజువాక : ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం స్థానిక బీజేపీ నాయకులు పలువురు అభ్యర్థులతో దరఖాస్తు చేయించారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో అభ్యర్థులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులకు రూ.10 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. 60 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ములకలపల్లి ప్రకాష్, శ్రీనివాసరావు, ప్రసన్న కుమారి, లక్ష్మి, శంకరమ్మ, మధు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గాజువాక: గతంలో సమ్మెల సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్ పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో తొలుత ర్యాలీ నిర్వహించిన కార్మికులు ఆ తరువాత జోనల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. గతంలో తాము నిర్వహించిన సమ్మెల సందర్భంగా కుదిరిన ఒప్పందాలపై జీవో జారీ చేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినదాలు చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి తమ డిమాండ్లపై వినతి పత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను యూనియన్ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి జోనల్ కమిషనర్‌కు వివరించారు. ప్రజారోగ్యం కోసం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాబాబు, గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, సోమాదుల గణేష్, మీనాక్షి, అరుణ, సత్యవతి, రాజు, సూర్యనారాయణ, సూరిబాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో పట్టుబడిన కారు వేలం

అక్కిరెడ్డిపాలెం: మద్యం సీసాలు విక్రయిస్తూ, నిల్వ ఉంచుకుని రవాణా చేస్తున్నందుకు సీజ్ చేసిన కారును వేలం వేయనున్నట్లు గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత ఏడాది నవంబర్ 4వ తేదీన గాజువాక పరిధిలో ఏపీ 31 బీఎన్ 3266 నంబరు గల మారుతీ 800 బీఎస్ 3 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కారును శుక్రవారం గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు నేరుగా స్టేషన్‌కు రావాలని అధికారులు కోరారు.

బండ బాదుడు

గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు ప్రజలపై అదనపు భారం



నియోజకవర్గంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలు :	13
మొత్తం కనెక్షన్లు (దీపం) :	93,015
సాధారణ వినియోగదారుల కనెక్షన్లు :	43,900
ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ ధర	రూ.862
రోజుకు సరఫరా అయ్యే సిలిండర్లు	13,000
ఈ లెక్కన అదనపు భారం	నెలకు రూ.1.95 కోట్లు

పెదగంట్యాడ: కేంద్రం మరోసారి సామాన్యుడిపై పిడుగు వేసింది. వంట గ్యాస్ ధరను ఏకంగా రూ.50 పెంచింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో విలవిల్లాడుతున్న ప్రజలపై ఈ పెంపు మరింత భారం కానుంది. ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో ఈ ధరల పెరుగుదల నియోజకవర్గ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనుంది. నియోజకవర్గంలో ఇండియన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ కంపెనీలకు చెందిన 13 ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో దీపం పథకం కింద 93,015 కనెక్షన్లు ఉండగా, సాధారణ వినియోగదారుల కనెక్షన్లు 43,900 వరకు ఉన్నాయి. ఇంతకుముందు డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.812 ఉండగా, తాజా పెంపుతో అది రూ.862కు చేరింది.

ఈ పెరిగిన ధర జనరల్ కనెక్షన్లతో పాటు ఉజ్వల పథకం వినియోగదారులకు కూడా వర్తిస్తుంది. సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి 7 సిలిండర్ల వరకు వినియోగిస్తుందని అంచనా. నియోజకవర్గ పరిధిలోని ఈ మూడు ప్రధాన కంపెనీల 13 ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు 13 వేల వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెరగడంతో, నియోజకవర్గ వ్యాప్తంగా వినియోగదారులపై రోజుకు అదనంగా రూ.6.50 లక్షల భారం పడనుంది. నెలకు ఈ భారం దాదాపు రూ.1.95 కోట్లకు చేరుకుంటుంది. అధిక సంఖ్యలో కుటుంబాలు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నందున, ఒక్కో కుటుంబం వంట గ్యాస్ కోసం ఏడాదికి అదనంగా రూ.350 (రూ.50 x 7 సిలిండర్లు) ఖర్చు చేయాల్సి వస్తుంది. తద్వారా నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంపై ఏడాదికి సగటున రూ.350 అదనపు భారం పడుతుందని అంచనా. ఈ ధరల పెరుగుదలతో నియోజకవర్గంలోని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న తమపై వంట గ్యాస్ ధరల పెంపు మరింత భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉజ్వల్ లబ్ధిదారులకు సైతం తప్పని ధరల సెగ

కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉద్దేశించిన ఉజ్వల్ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు అందజేసింది. నియోజకవర్గంలోనూ వేలాది మంది అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం కింద గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. అయితే, తాజాగా పెంచిన రూ.50 గ్యాస్ ధర ఉజ్వల్ లబ్ధిదారులకు కూడా వర్తించనుంది. దీంతో ఉచితంగా గ్యాస్ పొందినప్పటికీ, ఇప్పుడు వారు అధిక ధర చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజల ఆగ్రహం - పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం పట్ల సామాన్య ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మోయలేని భారం వేసినా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర పరిధిలోని ధరలను నియంత్రించడానికి ప్రభుత్వ పెద్దలు ముందుకు రాకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మోపిన ఈ ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ చార్జీల మోత

ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపుతోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ పెంపు పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో విద్యుత్ బిల్లుపై రూ.100 నుంచి రూ.300 వరకు అదనంగా వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఒక వైపు చార్జీలు పెంచి, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ పేరుతో బిల్లులో చూపించడం గందరగోళానికి గురిచేస్తోందని వారు అంటున్నారు.

అదనపు భారం.. దారుణం



గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం దారుణం. ఇది పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారంగా మారుతోంది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. దీనిపై కూటమి ప్రభుత్వం చొరవ చూపి ప్రజలపై భారాన్ని తగ్గించాలి.

–దల్లి కనకమ్మ, పెదగంట్యాడ

పెంచిన ధర తగ్గించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాలు, కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వంతు వచ్చింది. గ్యాస్ సిలిండర్ ధర పెంచడంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది. ప్రస్తుత పరిస్థితుల్లో రోజు గడవడమే కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ధరలు పెంచడం సరికాదు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం భరించాలి.

–ధర్మాల సరస్వతి, నెల్లిముక్కు

శివకుమార్ నిజాయితీ



షణ్ముఖ కుమార్‌కు డబ్బులు అందజేస్తున్న శివకుమార్

అక్కిరెడ్డిపాలెం: బ్యాంకు నుంచి డ్రా చేసుకున్న సొమ్మును ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పోగొట్టుకున్న వ్యక్తికి ఊహించని విధంగా ఉపశమనం లభించింది. తన కుమార్తెను ఇంటికి తీసుకువెళ్తున్న గాజువాక ప్రాంతానికి చెందిన కొర్ల శివకుమార్ కు ఆటోనగర్ వైదేహి కాటా వద్ద రోడ్డుపై చిరిగిన క్లాత్ బ్యాగులో రూ. 3.60 లక్షలు మూట కనిపించింది. ఎవరైనా పోగొట్టుకున్న వారికోసం కొంతసేపు వేచి చూసిన అనంతరం, శివకుమార్ ఆ నగదు మూటను నిజాయితీగా గాజువాక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. యాదవ జగ్గరాజు పేటకు చెందిన మోడీ షణ్ముఖ కుమార్ అనే వ్యక్తి గురువారం గాజువాక పోలీస్ స్టేషన్‌కు వచ్చి తాను హిటాచీ కంపెనీ ఏటీఎంను నిర్వహిస్తున్నానని తెలిపాడు. ఈ నెల 15న యాక్సిస్ బ్యాంకు నుంచి రూ. 3.60 లక్షలు డ్రా చేసి ఇంటికి వెళ్తుండగా డబ్బు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. గాజువాక సీఐ ఏ. పార్థసారధి వెంటనే స్పందించి వివరాలు సేకరించారు. ఇదివరకే శివకుమార్ స్టేషన్‌లో అప్పగించిన నగదు, షణ్ముఖ కుమార్ పోగొట్టుకున్న నగదు ఒకటే అని నిర్ధారించారు. దీంతో పోలీసులు శివకుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి, సీఐ, సిబ్బంది సమక్షంలో ఆ నగదును షణ్ముఖ కుమార్‌కు అందజేశారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు తిరిగి రావడంతో బాధితుడు షణ్ముఖ కుమార్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నిజాయితీగా డబ్బును పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన శివకుమార్‌ను గాజువాక సీఐ ఏ. పార్థసారధి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే షణ్ముఖ కుమార్ కూడా శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.70 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. గురువారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం



ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన అగనంపూడి జూనియర్ కళాశాల విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల అంకితభావంతో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు అన్నారు.అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కళాశాల ద్వితీయ స్థానం , మొదటి సంవత్సరం ఫలితాల్లో తృతీయ స్థానం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాలు గొల్లవిల్లి కనక భవానీ మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. కళాశాల స్థాపించిన కొద్ది కాలంలోనే జిల్లా స్థాయిలో వరుసగా రికార్డులు సృష్టిస్తూ రావడం అభినందనీయమన్నారు.అనంతరం, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ మరియు ఒకేషనల్ కోర్సులు అయిన ఈఈటీ, ఎంపీహెచ్‌డబ్ల్యూలలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులను, కళాశాల ప్రిన్సిపాల్‌ను ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు డి. దివ్య, ఎం. శ్రీదేవి, డి. మంగల, సమీరా, రూతు, అవినాష్, ఆదినారాయణ, శివ నాగేశ్వరరావు, సూర్య ప్రదీప్, ద్రాక్షాయిని మరియు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం

ఉక్కునగరం: ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూల జగజీవన్‌రామ్ అన్నారు. గురువారం జరిగిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసలు సుప్రీంకోర్టు తీర్పే రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు.షెడ్యూల్డ్ కులాలను ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని, రాజ్యాంగంలోని 342(1) ఆర్టికల్ ప్రకారం ఆ అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది తెలంగాణా ఎన్నికల సమయంలో మాదిగల ఓట్ల కోసం ఎమ్మార్పీఎస్ సభలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటన దీనికి సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో తాజా జనాభా లెక్కలతో శాస్త్రీయమైన డేటాను సేకరించాలని స్పష్టంగా చెప్పిందని జగజీవన్‌రామ్ గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ఆర్డినెన్స్ 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం రూపొందించారని ఆయన విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి జనాభా లెక్కలు కూడా మాలల జనాభాను తక్కువగా చూపించాయని, మాదిగల జనాభాను ఎక్కువగా చూపించాయని ఆయన ఆరోపించారు.

తాజా జనాభా లెక్కలు మరియు శాస్త్రీయ డేటా లేకుండా కేవలం రాజకీయ అవసరాల కోసం ఈ ఆర్డినెన్స్ జారీ చేస్తే, అది తిరిగి సుప్రీంకోర్టుకు వెళ్లవలసి వస్తుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. అందువల్ల, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ఆర్డినెన్స్‌ను సుప్రీం కోర్టులో సవాలు చేస్తామని బూల జగజీవన్‌రామ్ తేల్చి చెప్పారు. సమావేశంలో జి. చింతయ్య, వి.ఎ. స్వామి, జి. సురేష్, రాజీవ్, గణేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

పెదగంట్యాడ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక జిల్లా అధికారి ఎస్. గోపి కృష్ణ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.మహిళలు ఇంట్లో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే ఆందోళన చెందకుండా ఆలోచించి వ్యవహరించే పద్ధతులను అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది జె. జగన్, ఎస్.కె. మీరాసాహెబ్, ఎం. సురేష్, డి. అనిల్, పి. రవి తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై డెమో చూపుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది

ఒలింపియాడ్ పోటీల్లో అరబిందో విద్యార్థులకు పతకాలు



స్వర్ణపతకం సాధించిన యశస్వినుఅభినందిస్తున్న కరస్పాండెంట్ రామారావు

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ పోటీల్లో పలు పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో గత నవంబర్, డిసెంబర్ నెలల్లో లెవెల్-1 పరీక్షలు జరిగాయి. గణితం, సైన్స్, కంప్యూటర్స్, జనరల్ నాలెడ్జ్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో పాఠశాల నుండి 69 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు, 15 మంది రజత పతకాలు, 8 మంది కాంస్య పతకాలు సాధించారు. అంతేకాకుండా, ఈ ప్రతిభావంతులైన విద్యార్థులందరూ లెవెల్-2 పోటీలకు కూడా ఎంపికయ్యారు. ప్రత్యేకంగా సోషల్ స్టడీస్ విభాగంలో పాల్గొన్న కె. యశస్వి కృష్ణ స్వర్ణ పతకంతో పాటు నగదు బహుమతిని కూడా గెలుచుకుంది.

తొలగించిన ప్రకటన బోర్డు

సాక్షి ఎఫెక్ట్..



ప్రకటన బోర్డును తొలగించిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: ట్రాఫిక్ బీట్ షెల్టర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డును అధికారులు తొలగించారు. దీనిపై బుధవారం 'ట్రాఫిక్ బీట్ షెల్టర్‌కు అడ్డంగా ప్రకటన బోర్డు' అనే కథనం సాక్షిలో వెలువడింది. ఈ కథనంపై గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు స్పందించారు. గురువారం ఆ ప్రకటన బోర్డును తొలగించారు. దీంతో బీట్ షెల్టర్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది బీహెచ్‌పీవీ నుంచి ఆటోనగర్ వైపు వచ్చే వాహనాలను స్పష్టంగా చూడగలుగుతున్నారు. ప్రకటన బోర్డును తొలగించినందుకు పలువురు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలి



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ సొమ్మును లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ సర్కిల్-3 కార్యాలయంవద్ద మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. దీపావళి నుంచి పేదలకు మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే, పేదలు మాత్రం గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు లబ్దిదారులు తమ చేతిడబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేశారని అన్నారు. అయితే, సబ్సిడీ సొమ్ము మాత్రం ప్రభుత్వం నుంచి అనేకమందికి ఇప్పటివరకు బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదన్నారు. సబ్సిడీ సొమ్ము కోసం ప్రజలు తమ పనులను కూడా మానుకొని అటు బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. తాము ఇటీవల నిర్వహించిన ప్రజాచైతన్య యాత్ర సందర్భంగా ప్రజలు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ధర్నా అనంతరం సబ్సిడీ సొమ్ము కోసం ఏఎస్‌వోకు దరఖాస్తులను అందజేశారు.

ఈ సందర్భంగా ఏఎస్‌వో టి.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత వంట గ్యాస్ సబ్సిడీని అందరికీ అందించిందని, రెండో విడత సబ్సిడీ కోసం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. తనకు అందిన దరఖాస్తులపై విచారణ చేపట్టి అర్హులకు సబ్సిడీ డబ్బులు తమ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఆర్.విమల, పి.వరలక్ష్మి, పి.రామారావు, బి.జగ్గునాయుడు, ఎస్.వాసు, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో సహవాసం



అగనంపూడి ప్రధాన కూడలి నుంచి పండా వీధిలోకి వెళ్లే వీధిలో శిథిలమైన డ్రైనేజీలు, ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు



దుర్గంధభరితంగా మారిన డ్రైనేజీలు

అగనంపూడి: జగన్నాథస్వామి ఆలయం వెనుక భాగం నుంచి రథం నిలిపే ప్రాంతం వరకు నివాసాలున్న ప్రాంత ప్రజలు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతం కావడంతో పాటు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న డ్రైనేజీలు శిథిలమై మూసుకుపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని అగనంపూడి వారపు సంత ఎదురుగా, జగన్నాథస్వామి ఆలయానికి వెళ్లే మార్గం, వెనుక వీధుల్లో (పండా వీధులు) పంచాయతీల కాలంలో నిర్మించిన డ్రైనేజీలు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థే లేదు. కుమ్మరి, పండా కుటుంబాలు నివసించే ఈ ప్రాంతం జాతీయ రహదారికి లోతట్టులో ఉండటంతో, ప్రధాన డ్రైనేజీల నుండి మురుగునీరు వీధిలోని డ్రైనేజీల్లోకి పొంగి ప్రవహిస్తోంది. దీంతో జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేయడానికి అవకాశం లేకపోవడంతో, స్థానికులు నిత్యం దుర్వాసన, పందులు, దోమలతో సహవాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రోడ్లకు తోడు, మురుగునీటి ప్రవాహానికి సరైన ఔట్‌లెట్లు లేకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంబేడ్కర్ వల్లే అందరికీ సమాన హక్కులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఆర్ జీఎం, డీజీఎం, నాయకులు

ఉక్కునగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన కృషి వల్లే దేశంలోని ప్రతి వ్యక్తికీ సమాన హక్కులు లభించాయని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఎస్. భాను, హెచ్‌ఆర్ డీజీఎం డి. రాధికలు పేర్కొన్నారు. గురువారం ప్లాంట్ పర్సనల్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జీఎం ఎస్. భాను, డీజీఎం డి. రాధికలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ, ప్రపంచంలోని వివిధ రాజ్యాంగాలను క్షుణ్ణంగా పరిశీలించి, అన్నింటికంటే ఉత్తమమైన రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర ఎంతో గొప్పదన్నారు. కొమ్ము ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ సత్యనారాయణ, జితేందర్, బి. అరవింద్ కుమార్, డి. మోహన్, టి. కనకరాజు, ఎస్. వెంకన్న, సుబ్బారావు, రవికుమార్, వంశీకృష్ణ తదితరులు పాల్గొని రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళులర్పించారు.